సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 1 । మార్చి । 2024



సర్వేకు లైన్ క్లియర్

మూడు జిల్లాల ప్రయోజనాలు, ప్రాంతాల అభివృద్ధి దృష్ట్యా ప్రతిపాదించిన బోధన్–నారాయణఖేడ్–బీదర్ రైల్వే లైన్ మళ్లీ తెరపైకి వచ్చింది. వివరాలు 8లో ▸



నేరాలు 84

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న దొంగ పోలీసులకు చిక్కాడు. ఈ నేరగాడు 84 చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. వివరాలు 8లో ▸

16న జాతీయ లోక్‌అదాలత్

సంగారెడ్డి టౌన్ : జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికారి ఆదేశాల మేరకు మార్చి 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్చినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

- సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ రూపేష్

కొండాపూర్(సంగారెడ్డి): చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానంతో అమాయకులను కొట్టి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని ఎస్పీ రూపేష్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని పోలీస్ స్టేషన్‌లో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కొండాపూర్ మండలంలోని మ్యూజియం సందర్శనకు వచ్చిన యాత్రికులను కిడ్నాపర్స్ అని అనుమానించి స్థానికులు కొట్టడం జరిగిందని, అలా చేయకుండా అనుమానితులు కనిపిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత గొడవల్లో జోక్యం చేసుకుని కెరియర్ నాశనం చేసుకోవద్దని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లలో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని వివరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. నేరాల నియంత్రణలో ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, ఎస్ఐ హరిశంకర్ గౌడ్, సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆనందం నాలుగింతలు

సాధారణంగా పుట్టినరోజు వేడుకలను ఏదాదికి ఒకసారి జరుపుకుంటారు. కానీ లీప్ ఇయర్‌లో పుట్టినవారు మాత్రం నాలుగేళ్లకోసారి జరుపుకుంటారు. లీప్ ఇయర్ రోజు అయిన గురువారం పలువురు శిశువులు జన్మించారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



జహీరాబాద్‌లో నలుగురు

జహీరాబాద్: జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో నలుగురు చిన్నారులు జన్మించారు. మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరి,హన్మంత్‌రెడ్డి దంపతులకు ఆడబిడ్డ పుట్టింది. కోహీర్ మండలం రాజనెల్లి గ్రామానికి చెందిన శిరీష, చంద్రశేఖర్‌లకు ఆడబిడ్డ జన్మించింది. జహీరాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సమీర–అబ్దుల్ రజాక్ దంపతులకు కుమారుడు జన్మించాడు. మూసానగర్ కాలనీకి చెందిన తమ్‌కిన్ బేగం–సయ్యద్ మక్సూద్ దంపతులకు ఆడబిడ్డ పుట్టింది.



మహేశ్వరి–హన్మంత్ రెడ్డి దంపతులకు పాప



శిరీష–చంద్రశేఖర్‌లకు జన్మించిన పాప



అబ్దుల్ రజాక్ దంపతులకు బాబు



తమ్‌కిన్ బేగం–సయ్యద్ దంపతులకు పాప

సంతోషంగా ఉంది



శిశువుతో చంపవతి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన రమావత్ చంపవతి, మోహన్ దంపతులకు సిర్గాపూర్ ప్రథమిక ఆరోగ్య కేంద్రంలో ఆడబిడ్డ పుట్టింది. రెండో కాన్పులో ప్రత్యేకమైన రోజున ఆడబిడ్డ పుట్టడం చాలా సంతోషంగా ఉందని ఆ దంపతులు తెలిపారు.

అదృష్టంగా భావిస్తున్నాం..



బిడ్డతో తల్లి యాస్మిన్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు చైతన్య నగర్ కాలనీకి చెందిన యాస్మిన్, షఫీ దంపతులకు ఏరియా ఆస్పత్రిలో ఆడ శిశువు పుట్టింది. నాలుగేళ్లకోసారి వచ్చే లీపు ఇయర్ రోజున బిడ్డ పుట్టడం చాలా అదృష్టమని చెప్పారు. ఈ రోజు పుట్టడం వల్ల మా బిడ్డకు గుర్తింపు వచ్చిందన్నారు.

నాలుగేళ్లకోసారి..



బిడ్డతో స్వాతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని బసంత్‌పూర్ గ్రామానికి చెందిన స్వాతి–శేఖర్‌రెడ్డి దంపతులకు మిర్జాపూర్(బి)లోని ప్రభుత్వాసుపత్రిలో బాబు పుట్టాడు. ప్రత్యేకమైన రోజు పుట్టడం వల్ల మా బాబు పుట్టిన రోజు నాలుగేళ్లకోసారి చేయాల్సి రావడం కొత్త అనుభూతి ఇస్తుంది.

మాకు ప్రత్యేకం



పాపతో తల్లిదండ్రులు, వైద్యుడు గోపి

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధి దేవరంపల్లి గ్రామానికి చెందిన సంజీవ్, అఖిల దంపతులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాప పుట్టింది. నాలుగేళ్లకోసారి వచ్చే రోజున చిన్నారి పుట్టడం మాకు ప్రత్యేకమని వారు తెలిపారు. ఈ వేడుకను ఘనంగా జరుపుకుంటాం.

మంత్రి కూతురు వివాహం

జోగిపేట(అందోల్): వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు త్రిష, మణికంఠల వివాహం లీపు సంవత్సరమైన గురువారం జరిగింది. ఇకపై వీరి మ్యారేజ్‌డే నాలుగేళ్లకోసారి వస్తుంది. ప్రత్యేకమైన రోజు పెళ్లి చేసుకోవడం ఆనందంగా ఉందని ఆ నవదంపతులు తెలిపారు.



మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు త్రిష, మణికంఠలు వివాహ వేడుక

న్యూస్‌రీల్

ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, ప్రజలు

జహీరాబాద్ టౌన్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం జహీరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ ఈద్గా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగింది. ఇందులో ప్రజానాట్యమండలి కళాకారులు ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నర్సింహ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇస్తామని చెప్పి అర్హులైన వారిని విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా హామీ నిలబెట్టుకోవాలన్నారు. లేదంటే ప్రభుత్వ స్థలాల్లో జెండాలు పాతుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా 2500 దరఖాస్తులను ఆర్డీఓ కార్యాలయ అధికారి సుభాష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నర్సింలు, రాజు, శంకర్, అశ్వాక్, మధుమాల, లక్ష్మి, చిరంజీవి, ఆనంద్, అజీజ్ పాల్గొన్నారు.

బడ్‌చిప్ విధానంతో సాగు బాగు




చెరకు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తీర్ణాధికారి భిక్షపతి

కోహీర్(జహీరాబాద్): బడ్‌చిప్ (ముచ్చెక్కల నుంచి నారును పెంచి నాటే పద్ధతి) విధానం ద్వారా చెరకు పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి తెలిపారు. గురువారం మండలంలోని పైడిగుమ్మల్ గ్రామ శివారులో రైతు జయసింహారెడ్డి బడ్‌చిప్ పద్ధతిలో సాగు చేసిన చెరకు పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్‌చిప్ విధానంతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ పద్ధతిలో చెరుకు కన్నులను యంత్ర సహాయంతో వేరు చేసి మిగిలిన చెరుకు గడలను బెల్లం లేదా పంచదార తయారీకి వినియోగించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి సవిత, ఆత్మ బీటీఎం చరణ్, రైతులు విక్రమ్ సింహారెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ హాజరు 97.62 శాతం

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని సెయింట్ ఆంథోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని డీఐఈఓ గోవిందరాం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 16859 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 16457 మంది (97.62 శాతం) హాజరు కాగా, 402 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ప్రతీ నియోజకవర్గానికి



- ఎమ్మెల్యేలకు నిధులు
- ఎస్‌డీఎఫ్ కింద మంజూరు
- పనులకు ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్రంలో కొత్త సర్కారు ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఎమ్మెల్యేలకు నిధులు మంజూరు చేసింది. ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) పేరుతో ఒక్కో నియోజకవర్గానికి రూ.పది కోట్ల చొప్పున కేటాయించింది. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం పద కొండు నియోజకవర్గాలకు రూ.110 కోట్లు రానున్నాయి. సాధారణంగా ఎమ్మెల్యేలకు సీడీపీ (నియోజకవర్గాల అభివృద్ధి పథకం) కింద ఏటా నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులతో సంబంధం లేకుండా ఈసారి ఎమ్మెల్యేలకు రూ.పది కోట్ల చొప్పున నిధులు ప్రభు త్వం ఇవ్వనుంది. వీటిని ఏ అవసరాలకు వినియోగించాలనే దానిపై ప్రభు త్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది.

గత ప్రభుత్వం మాదిరిగానే..

గత ప్రభుత్వంలోనూ ఈ ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. అప్పటి సీఎం కేసీఆర్ జిల్లాకు వచ్చిన పలు సందర్భాల్లో ఎస్‌డీఎఫ్ కింద నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఒక్కో మున్సిపాలిటీకి రూ.20 కోట్ల నుంచి రూ.50 కోట్లు, గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున అప్పట్లో ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు అప్పటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌లకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసుకుని ఈ ఎస్‌డీఎఫ్ కింద నిధులు తెచ్చుకున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎస్‌డీఎఫ్ కింద నిధులు మంజూరు చేసింది.

ఆమోదం ఉండాల్సిందే..

ఈ ఎస్‌డీఎఫ్ నిధులకు సంబంధించి పనుల ప్రతిపాదనలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ఎమ్మెల్యేలు ఈ పనులను ప్రతిపాదించాలంటే సంగారెడ్డికి ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కొండ సురేఖ ఆమోదం తప్పక ఉండాలి. ఇప్పటికే జిల్లాలో ఎమ్మెల్యేలు ఈ పనులను ప్రతిపాదిస్తున్నారు. అయితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులకు ఇన్‌చార్జి మంత్రి ఆమోద ముద్ర పడుతుందా..? లేదా స్థానికంగా ఉన్న అధికార కాంగ్రెస్ నేతలు ఇచ్చే పనులకు ఆమోదం లభిస్తుందా అనేది వేచి చూడాల్సిందే.

విద్యకు రూ.2 కోట్లు తప్పనిసరి

ప్రభుత్వం ఇచ్చే రూ.10 కోట్ల నిధుల్లో రూ.2కోట్లు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల అభివృద్ధి, మరమ్మతుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. రూ.కోటి నిధులను తాగునీటి అవసరాలకు వాడుకోవాలి. వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. రూ.50 పరిపాలన ఖర్చులు పోగా మిగిలిన రూ.ఆరు కోట్లను ఇతర పనులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించాల్సి ఉంటుంది. కార్యకర్తలకు కలిసొచ్చే సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పనులనే ఎమ్మెల్యేలు ప్రతిపాదించే అవకాశాలున్నాయి.

కుంగేశ్వరంగా మారిన కాళేశ్వరం

నారాయణఖేడ్: కాళేశ్వరం ప్రాజెక్టు కుంగేశ్వరంగా మారిందని, దీని నిర్మాణంలో జరిగిన అక్రమాలను వెలికితీయకుండా పాత ముఖ్యమంత్రిని నిందించడంలోనే కొత్త సీఎం కాలయాపన చేస్తున్నాడని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆరోపించారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం రాజీవ్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రూ.1.60లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి నేడు దారుణంగా మారిందన్నారు. ఇప్పటికే గత పాలకులు రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని, ప్రస్తుతం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలంటే రేవంత్ మరో రూ.2లక్షల కోట్లు అప్పులు చేయాల్సి ఉందన్నారు. అందోల్, నారాయణఖేడ్, కొల్లాపూర్ పూర్తిగా వెనుకబడి ఉన్నాయన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఖేడ్ నియోజకవర్గంలో బీజేపీ 70 వేల ఆధిక్యత సాధించడం ఖాయమన్నారు. దేశంలో బీజేపీ 400 సీట్లు సాధిస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఆలే భాస్కర్, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, సంగప్ప, రజనీకాంత్ , రవికుమార్, అమర్‌సింగ్, విజయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

మనూరు(నారాయణఖేడ్): దేశంలో పార్టీలకతీతంగా అభివృద్ధి చేసిన ఘనత మోదీకే దక్కిందని వెంకటరమణారెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్ర మనూరు మండలంకు చేరుకున్న సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి గెలుపొందిన ఎంపీ అభ్యర్థులు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. వారు కనీసం ప్రజల మధ్య సైతం తిరగలేదన్నారు. తమ పార్టీ అధికారంలో లేకున్న జహీరాబాద్‌కు నిమ్జ్‌ను, ఎయిమ్స్‌ను, నేషనల్‌హైవేలను ఇచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. అనంతరం మనూరు నుంచి నారాయణఖేడ్ వరకు కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

- కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరణి సమస్యలపై మార్చి 1 నుంచి 9 వరకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని కలెక్టర్ క్రాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఉన్న దరఖాస్తులను మండల కార్యాలయాలకు పంపిస్తామని, రెవెన్యూ శాఖ ద్వారా మండల గ్రామస్థాయిలో పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రతి దరఖాస్తు కలెక్టర్ ద్వారా పరిష్కరించేలా ఉండేవని, ప్రభుత్వం కొత్త నిబంధనలు సవరించిందని చెప్పారు. దీని ప్రకారం కొన్ని అధికారాలు రెవెన్యూ డివిజనల్ అధికారులకు, తహసీల్దార్లకు ఇచ్చి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం మూడు బృందాలలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయిలో అధికారులు ఉంటారని చెప్పారు. సర్వేయర్, గిర్దావర్ పేరా, లీగల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్, వీళ్ళందరూ ఈ బృందాలతో ఉంటారని తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సంగారెడ్డి : ఈ నెల 5న ప్రధాని మోదీ జిల్లాలో పర్యటన సందర్భంగా కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్ ఏర్పాట్లను పరిశీలించారు. కంది ఐఐటీలో మోదీ ల్యాండింగ్ ఏరియా పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు తదితరులు ఉన్నారు.

'మెగా' సంబురం

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- జిల్లాలో భర్తీ కానున్న 551 ఉపాధ్యాయ పోస్టులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు



జిల్లాలో పోస్టుల వివరాలు

మొత్తం ఖాళీలు	909
పోస్టులు	551
స్కూల్ అసిస్టెంట్లు	92
భాషా పండితులు	24
ఎస్జీటీ	385
పీఈటీ	6
స్పెషల్ ఎడ్యుకేటర్	44

సంగారెడ్డి /సంగారెడ్డి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ కోసం ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తిపికబురును అందించింది. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను గురువారం సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో 551 పోస్టులు భర్తీ కానున్నాయి. కొన్నేళ్లుగా పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగుల కల త్వరలో నెరవేరనుంది. ఈ నెల 4వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు.

మొత్తం ఖాళీలు 551

జిల్లా వ్యాప్తంగా ఉన్న 551 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్నారు. గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేసుకోనవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు 863, ప్రాథమికోన్నత 371, ఉన్నత పాఠశాలలు 501 ఉన్నాయి. జిల్లాలో 909 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 47 పాఠశాలలు ఉపాధ్యాయుల కొరత వల్ల మూతపడ్డాయి. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పిస్తే మరిన్ని పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

మూతపడిన పాఠశాలలు తెరుచుకునే అవకాశం..

గ్రామాల్లో మూసివేసిన పాఠశాలకు పూర్వ వైభవం దక్కనుంది. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు జీరో ఎన్రోల్మెంట్ ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అధికారులు మూసి వేశారు. ప్రతి గ్రామంలో పాఠశాల ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించడంతో మూతబడిన బడులు తెరుచుకోనున్నాయి. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

పుస్తకాలతో కుస్తీ

ఎనిమిదేళ్లుగా నిరీక్షించిన నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ఊపిరి పోసినట్లయింది. ఉపాధ్యాయ కొలువులే లక్ష్యంగా డీఎడ్, బీఎడ్ లో శిక్షణ పొందిన వేల మంది యువకులు ఉద్యోగం సాధించేందుకు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఇందుకోసం సొంతూళ్లను వదిలి వివిధ ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. మరికొందరు స్థానిక గ్రంథాలయాల్లో పుస్తకాలను తిరగేస్తున్నారు.

4 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఆన్‌లైన్‌లో ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.1000 ఫీజుగా నిర్ణయించారు. ఆగస్టులో విడుదలైన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి చేయాల్సిన అవసరం లేదు. తొలిసారిగా డీఎస్సీని సీబీఆర్టీ (కంప్యూటర్ బేస్‌డ్ రిటెన్ టెస్ట్) పద్ధతి ద్వారా నిర్వహించనున్నారు. ఇందు కోసం 11 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

హర్షాతిరేకం

ఏడేళ్ల తర్వాత ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా నోటిఫికేషన్ విడుదల చేసి కాలయాపన చేయవద్దని, త్వరగా పరీక్షను నిర్వహించి మెరిట్ లిస్టును విడుదల చేసి రిజర్వేషన్ల వారీగా పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నారు.

ఆరేళ్లుగా వేచి చూస్తున్న

డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసిన. పరీక్ష పెట్టకపోవడంతో నిరుత్సాహం నెలకొంది. ప్రభుత్వం 11వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది.

– మహేష్, డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థి, సంగారెడ్డి

మేడిగడ్డ పర్యటన రాజకీయ డ్రామా

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ పర్యటన చేపట్టడం రాజకీయ డ్రామా అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డను గతంలోనే కేసీఆర్ ఎన్నో సార్లు చూశారన్నారు. కేటీఆర్ అక్కడికి వెళ్లి ఏమి చేస్తారని, మేడిగడ్డ కుంగలేదని చెబుతారా? అని చాడా ప్రశ్నించారు. వాస్తవాలు కళ్లకు కనిపిస్తునే ఉన్నాయన్నారు. ఇప్పటికే కాగ్, నిజనిర్ధారణ కమిటి ప్రభుత్వానికి నివేదికలు సైతం ఇచ్చాయన్నారు. కప్పిపుచ్చుకోవాలని చూస్తే రాజకీయ శూన్యానికి దారి తీస్తుందన్నారు. అయోధ్యలో రాముడు పుట్టాడని అనడానికి ప్రత్యక్షంగా సాక్ష్యం లేదన్నారు. ఎంపీ బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఢిల్లీలో రైతులపై డ్రోన్లతో బాష్పవాయువు ప్రయోగించడం తగదన్నారు. ప్రధాని రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

క్లుప్తంగా

జర్నలిజంలో గోల్డ్ మెడల్

గవర్నర్ చేతుల మీదుగా అందజేత



తమిళి సై చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న కమల్ సురేశ్

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం వరిగుంతం సీతారాం తండాకు చెందిన కమల్ సురేశ్‌కు తెలుగు యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఎంఫిల్‌లో గోల్డ్ మెడల్ లభించింది. 'ప్రొఫెషనల్ ఛాలెంజెస్ ఆఫ్ రూరల్ రిపోర్టింగ్ ఏ స్టడీ ఆఫ్ రూరల్ రిపోర్టర్స్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై కమల్ సురేశ్‌కు మెడల్ లభించింది. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ఇటీవల నిర్వహించిన 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళి సై సౌందర్య రాజన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సురేశ్ చదువులో ముందు ఉంటూ పదేళ్లపాటు అఖిల భారత విద్యార్థి పరిషత్ జెండా పట్టి పేద మధ్యతరగతి విద్యార్థుల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అత్యున్నత యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ అందుకున్నారు. యూనివర్సిటీ ఆధ్యాపకులు, తల్లిదండ్రులు, పలువురు సురేశ్‌ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అందె భాస్కర్‌కు 'ఉస్తాద్ యువ పురస్కారం'



అందె భాస్కర్

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ డప్పు ఉద్యమ కళాకారుడు అందె భాస్కర్‌కు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం వరించింది. ఢిల్లీ సంగీత నాటక అకాడమీ ఈ మేరకు అందె భాస్కర్ పేరును ప్రకటించింది. దేశంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత వేత్త ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పేరు మీదుగా ప్రతీ ఏడాది రాష్ట్రపతి చేతుల మీదుగా యువ పురస్కారం అందిస్తారు. 2022–23 సంవత్సరానికి గానూ మిరుదొడ్డి మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన అందె (అంగడి) భాస్కర్ డప్పు వాయిద్యాన్ని ఖండాంతరాలు దాటించిన నేపథ్యంలో యువ పురస్కారం లభించింది. ఈ అవార్డు ప్రకటించిన జ్యూరీ సభ్యులకు, కేంద్ర సంగీత నాటక అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులకు ఈ సందర్భంగా భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

మానసికంగా, దృఢంగా ఉండాలి



మాట్లాడుతున్న అధికారి కవిత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వసతి గృహాల విద్యార్థులకు ఒక్కరోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి కవిత మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం తమ చదువులపై మాత్రమే శ్రద్ధ వహించాలన్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకునే విధంగా క్రీడలు, యోగా, తదితర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, డీసీపీఓ రాము, మానసిక వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండల పరిధిలోని రిమ్మనగూడలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చింది. ఈ మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశాం. ఇందులో ఐదుగురు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 14,047 నగదు, 5 బైక్‌లు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్వేకు లైన్ క్లియర్

తుది దశ రైల్వే లైన్ సర్వేకు రూ.2.85 కోట్లు విడుదల

- బోధన్ నుంచి బీదర్ వరకు ట్రాక్
- మొత్తం 114.10 కిలోమీటర్లు
- మూడు జిల్లాలకు ప్రయోజనం
- 14 ఏళ్ల తర్వాత లభించిన మోక్షం



మూడు జిల్లాల ప్రయోజనాలు, ప్రాంతాల అభివృద్ధి దృష్ట్యా ప్రతిపాదించిన బోధన్–నారాయణఖేడ్–బీదర్ రైల్వే లైన్ మళ్లీ తెరపైకి వచ్చింది. తుది సర్వేకు నిధులు మంజూరు చేయడంతో ఈ రైల్వే లైన్‌పై ఆశలు చిగురించాయి. 14 ఏళ్ల కిందట ఈ రైల్వే లైన్‌కు ప్రతిపాదనలకు అంకురార్పణ జరుగగా వెనువెంటనే మొదటి విడత సర్వేకు నిధులు మంజూరై సర్వే సైతం పూర్తయ్యింది. అనంతర కాలంలో ప్రభుత్వాలు మారడంతో పెండింగ్ పడుతూ వచ్చి రెండో విడత కూడా పూర్తయ్యింది. తుది సర్వేకూ ఇటీవల రూ.2.85 కోట్లు మంజూరు చేస్తూ రైల్వేబోర్డు సంయుక్త సంచాలకులు అభిషేక్ జగావత్ ఉత్తర్వులు జారీ చేయడంతో మళ్లీ ఆశలు చిగురించాయి.

– నారాయణఖేడ్

బోధన్–నారాయణఖేడ్–బీదర్ రైల్వే లైను కోసం మూడు దశల్లో సర్వే నిర్వహించాల్సి ఉండగా 14 ఏళ్లలో రెండు విడతలు మాత్రమే పూర్తి చేశారు. 2010లో మొదటిసారి సర్వే జరుగగా, 2015లో రెండోసారి ఇందుకు నిధులు మంజూరు కాగా సర్వే నిర్వహించారు. తుది విడత సర్వేకు 2015 తర్వాత ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 114.10 కి.మీటర్లు సర్వే చేసి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును రూపొందించడానికి రూ.2.85 కోట్లు కేటాయించారు. దీంతో రైల్వే లైను నిర్మించనున్న ప్రాంతాలైన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, నిజామాబాద్ జిల్లా బోధన్, కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ వాసుల్లో ఆశలు చిగురించాయి.

సురేశ్ షెట్కార్ కృషితో తొలి అడుగు..

ప్రతీ సార్వత్రిక ఎన్నికల్లోనూ అన్ని పార్టీలు రైల్వే లైను అంశాన్ని హామీగా ప్రకటించడం సాధారణంగా మారింది. 2010లో ఎంపీగా సురేశ్ షెట్కార్ ఉండగా అప్పటి రైల్వే శాఖ మంత్రి మమతా బెనర్జీ ఈ రైల్వే లైను మొదటి సర్వే కోసం రూ.50 లక్షలు మంజూరు చేశారు. 2012లో సర్వే పూర్తయింది. నివేదికను ప్లానింగ్ కమిషన్‌కు అందించడంలో జాప్యం కారణంతో 2013 బడ్జెట్‌లో బోధన్- బీదర్ రైల్వేలైను ఊసెత్తలేదు. బడ్జెట్ ప్రవేశపెట్టిన కొన్ని నెలలకు ప్లానింగ్ కమిషకు నివేదికను పంపారు. అనంతరం మరో రెండు సార్లు సర్వే చేపట్టాల్సి ఉండగా చేయలేదు. 2015లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రెండోసారి సర్వే కోసం రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు 114.10 కిలోమీటర్ల రైల్వే లైనుకు రూ.2,000 కోట్లు అవసరమని అంచనా వేశారు. తాజాగా తుది సర్వేకు రూ.2.85కోట్ల నిధులు మంజూరయ్యాయి.

మూడు జిల్లాలకు ప్రయోజనం

బోధన్ -ఖేడ్ -బీదర్ రైల్వే లైనుతో సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. కర్ణాటకతో అనుసంధానం ఏర్పడి పలు రాష్ట్రాల ప్రజలకు రైల్వే సేవలు అందుతాయి. నిజామాబాద్ జిల్లా బోధన్, కామారెడ్డి జిల్లా బాన్సువాడ, జుక్కల్, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గం మీదుగా బీదర్ వరకు 114.10 కి.మీటర్ల మేర లైను నిర్మించాల్సి ఉంటుంది. ఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్, కంగ్టి, సిర్గాపూర్, నారాయణఖేడ్, మనూరు మండలాల మీదుగా రైల్వే ట్రాక్ నిర్మించాలి. ఖేడ్ అన్ని రంగాల్లో వెనుకబడింది. ఎలాంటి పరిశ్రమలు లేవు, అందువల్లే ఈ ప్రాంతం వలసలకు పేరుగాంచింది. పరిశ్రమల ఏర్పాటుకు రహదారులు, రైల్వే లైన్లు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తారు. రైల్వేలైన్ వస్తే ముున్ముందు పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

రైల్వేలైన్‌తో అభివృద్ధి



నాడు ఎంపీగా ఉండగా సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అభివృద్ధితోపాటు, ప్రాంత ప్రజల ప్రయోజనం నిమిత్తం బోధన్–నారాయణఖేడ్–బీదర్ రైల్వే లైన్ కోసం ప్రతిపాదించాను. 2010లో సర్వేకు నిధులు మంజూరు చేయించి సర్వే పూర్తి చేయించాను. తర్వాతి కాలంలో ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి త్వరగా సర్వే పూర్తి చేసి రైల్వేలైన్ ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తాను.

– సురేశ్ షెట్కార్, మాజీ ఎంపీ

పూర్తయ్యేలా కృషిచేస్తా



బోధన్– నారాయణఖేడ్–బీదర్ రైల్వేలైన్ 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాటి ఎంపీ సురేశ్ షెట్కార్ కృషి ఫలితంగా మంజూరు అయ్యింది. లైన్ మంజూరీతోపాటు సర్వేకు నిధులు విడుదలై రెండు విడతలు సర్వే జరిగి పూర్తి అయ్యాయి. చివరి విడత సర్వే పూర్తవగానే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి లైన్ ఏర్పాటుకు కృషి చేస్తా. రైల్వే లైన్‌తో ఖేడ్ ప్రాంతంలో వ్యాపార, పారిశ్రామిక అభివృద్ధి సాధ్యపడుతుంది.

– డాక్టర్ సంజీవరెడ్డి, ఖేడ్ ఎమ్మెల్యే

విద్యార్థి తనను తాను తీర్చిదిద్దుకోవాలి

- ఓయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ చెన్నప్ప
- ప్రాజెక్ట్ నివేదికల తయారీపై కార్యశాల



మాట్లాడుతున్న ప్రొఫెసర్ చెన్నప్ప

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థి నిత్యం తనను తాను తీర్చిదిద్దుకునేందుకు కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగాధిపతి సీనియర్ ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రాజెక్టుల నివేదిక తయారీపై ఒక రోజు కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మట్లాడారు. విద్యార్థులు ఒక అంశంపై సూక్ష్మ పరిశీలన, పరిశోధన దృక్పథాన్ని అలవర్చుకోవడంతోపాటు సామాజిక, ఆర్థిక సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు డిగ్రీ స్థాయిలో ప్రాజెక్టుల తయారీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి కేంద్రంగా కార్యక్రమాల నిర్వహణలో కామర్స్ విభాగం ఎప్పుడూ ముందు ఉంటుందని అభినందించారు. కార్యశాల సమన్వయకర్త డాక్టర్ గోపాల సుదర్శనం సీనియర్ అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, డాక్టరు అయోధ్య రెడ్డి, డాక్టర్ మధుసూధన్ మాట్లాడుతూ పరిశోధనా రంగంలో రాణించాలనే వారికి ప్రాజెక్టుల నివేదికల తయారీ నైపుణ్యాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు.

సేవలు అభినందనీయం

జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవకీదేవి



ఐటీసీ వాహనాన్ని ప్రారంభిస్తున్న దేవికీదేవి

సిద్దిపేటరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, ఎరువుల తయారీ వంటి వాటిపై సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవకీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టును ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ దేవకీదేవి మాట్లాడుతూ.. ఇర్కోడ్, చిన్నగుండవెల్లి, పుల్లూరు, రాఘవాపూర్ గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై ఇంటింటికీ అవగాహన కల్పిస్తూ గ్రామాలను ఆదర్శంగా మారుస్తున్న స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమన్నారు. మాజీ సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త ద్వారా ఎరువులు తయారు చేసి విక్రయించడం ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు అందుతున్నాయన్నారు. అనంతరం ఇర్కోడ్, రాఘవాపూర్ గ్రామాలకు చెత్తను కటింగ్ చేసే షెడ్డర్ మిషన్లను అందించారు. అన్ని గ్రామాల ప్రజలకు తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఐటీసీ వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీజీవి డైరెక్టర్ కిరణ్‌కుమార్, సీజీవి పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ జ్యోతి శైలేంద్ర, సాహస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ మహేశ్‌కుమార్, ఎంపీఓ హరిప్రసాద్, కార్యదర్శి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

శక్తిపీఠం.. పోటెత్తిన భక్తజనం



కేరళ వాయిద్యకారుల సందడి



పూజా మహోత్సవంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ శక్తిపీఠం మొదటి వార్షికోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాభిషేకం, పూర్ణాహుతి చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో బగలాముఖీ ఆలయ పరిసరాలు నిండిపోయాయి. సిరివేరు సంగీత శాంతకుమార్‌గుప్తా అన్నదానం నిర్వహించారు. దివంగత గోలి వెంకటేశం జ్ఞాపకార్థం ఆయన కుమారులు రెండు రోజుల పాటు తాగునీటి వసతి కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ లలితా పీఠం పీఠాధిపతి బ్రహ్మానందా సరస్వతి, రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్‌గౌడ్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ప్రముఖ గాయకుడు రంగాచారి, గోల్డ్‌మెన్ చిన్నాగౌడ్, పలువురు వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

తాళం వేసిన ఇళ్లలో చోరీలు



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

నిజాంపేట(మెదక్): తాళం వేసిన ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టించిన ఘటన నిజాంపేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలానికి చెందిన బత్తుల శివమ్మ ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు 8 తులాల వెండి, కొంత నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, కమ్మరి బాల్‌రాజ్ ఇంటి తాళం పగులగొట్టి 10 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. అనంతరం పప్పుల కిష్టారెడ్డి ఇంటిలో వెండి ఆభరణాలు 12 తులాలు, చిన్న పిల్లలకు చెందిన అర్ధతులం బంగారంతోపాటు రూ.9,500 నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ డబ్బాలు చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తు తెలియని వ్యక్తులు సెంట్రింగ్ డబ్బాలు చోరీ చేసిన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని తూప్రాన్- నర్సాపూర్ హైవే పక్కన ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పిల్లర్ల ఏర్పాటు కోసం అక్కడ ఉంచిన 56 సెంట్రింగ్ డబ్బాలను చోరీ చేసి ఆటో ట్రాలీలో తీసుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధిత మేస్త్రీ గొండస్వామి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక, మట్టి వాహనాలు సీజ్



జంగరాయిలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

చిన్నశంకరంపేట(మెదక్): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. మండలంలోని జంగరాయి గ్రామానికి చెందిన ప్రసాద్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గవ్వలపల్లి చౌరస్తాలో పట్టుకున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్..

రామాయంపేట(మెదక్): మండలంలోని పర్వతాపూర్ గ్రామ శివారులోని చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం నీరుపారుదల శాఖ అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారికి అందిన సమాచారం మేరకు ఆ శాఖ ఏఈ కుషాల్ పోలీసులతో కలిసి చెరువు వద్దకు వెళ్లి టిప్పర్‌ను పట్టుకున్నారు. చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

డ్యూటీ ముగించుకొని ఇంటికొస్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం
- అక్కడికక్కడే వ్యక్తి మృతి

మనోహరాబాద్(తూప్రాన్): బైక్‌ను బొలేరో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన జీడిపల్లి సత్యనారాయణ (54) కొన్నేళ్లుగా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో ఉంటూ స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు. గురువారం పరిశ్రమలో విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుకాల నుంచి బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్యనారాయణ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూర్ పోచారం గ్రామానికి చెందిన పోచమ్మ గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో పోచమ్మ కోసం భర్త రాజు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య అదృశ్యంపై భర్త రాజు గురువారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుదలతో ఉద్యోగాలు సాధించి

రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా వాసులు ఉద్యోగాలు సాధించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంలో పలువురు అభినందించారు.



స్రవంతి

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన గొడుగు స్రవంతి గురువారం విడుదల చేసిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు. గొడుగు నర్సింహులు, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు పిల్లల్ని చదివించారు. పెద్ద కుమార్తె స్రవంతి లెక్చరర్ ఉద్యోగం సాధించగా, రెండో కుమార్తె సుకన్య కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తోంది.

ఫిజిక్స్ లెక్చరర్‌గా..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నక్క కల్యాణి గురువారం ప్రకటించిన గురుకుల ఫలితాల్లో ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు ఆమెను అభినందించారు.



కల్యాణి

నిరుపేద కుటుంబం..



తల్లిదండ్రులతో బాబు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల జేఎల్ పరీక్ష ఫలితాల్లో దూల్మిట్ట మండల పరిధిలోని కూటిగల్ గ్రామానికి చెందిన బురుగు వెంకటయ్య, భద్రవ్వ కుమారుడు బాబు అర్హత సాధించాడు. నిరుపేద కుటుంబంలో పుట్టిన బాబు మాథ్స్ ఉపాధ్యాయుడిగా నియామకం కావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య



పోచయ్య(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిలప్‌చెడ్ మండలంలో చోటు చేసుకుంది. గురువారం ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. అజ్జమర్రి గ్రామానికి చెందిన అతినారం పోచయ్య (42) మిషన్ భగీరథ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతేడాది నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఐదు నెలల కిందట అతడి తమ్ముడు, మరదలు పిల్లలు కావడం లేదని ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో మరికొంత మానసిక వేదనకు గురయ్యాడు. గత నెల 25వ తేదీన భార్య అమృతను అమ్మగారి ఇంటికి పంపించాడు. 28న గ్రామంలో పలువురితో మాట్లాడుతూ తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెబుతూ వెళ్లి పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో చెరువులో దూకి..

తూప్రాన్: చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గజ్జెల గౌరమ్మ (50) బుధవారం కుమారుడు యాదగిరితో కుటుంబ సమస్యలపై గొడవ పడింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. పట్టణ సమీపంలోని పెద్ద చెరువులో నీటిపై గౌరమ్మ మృతదేహం తేలడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో..

మెదక్ మున్సిపాలిటీ: చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. మృతుడి తండ్రి వరాల మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. వరాల విష్ణు(24) కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతుండటంతో ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మందులు వాడుతున్నా పరిస్థితి మెరుగుపడక పోవడంతో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు మెదక్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు @ 84

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ పోలీసులకు చిక్కాడు. హైదరాబాద్‌కు చెందిన ఈ నేరగాడు 84 చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గురువారం డీఎస్పీ వెంకట్‌రెడ్డి తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చాంద్రాయన్ గుట్టకు చెందిన సయ్యద్ హమీద్ అలియాస్ హైమాద్(47) చెడు వ్యసనాలకు బానిసై 1996 నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణలోని పలు జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా ఎంచుకున్నాడు. ఇప్పటి వరకు 84 ఇళ్లలో చోరీకి పాల్పడి 10 సార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. చోరీలనే వృత్తిగా ఎంచుకొని జల్సాలకు అలవాటు పడినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే గతనెల 22న తూప్రాన్ పట్టణ కేంద్రంలోని టాటాకాఫీ కాలనీలో నివాసం ఉంటున్న ఉమారాణి ఇంటికి తాళం వేసి ఉండడంతో చోరీకి పాల్పడి సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు చాకచక్యంగా సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని చాంద్రాయన్‌గుట్టలోని తన నివాసంలో అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడి నుంచి 7.5 తులాల బంగారం రికవరీ చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేసిన సీఐ కృష్ణ, ఎస్‌ఐ శివానందం, పోలీసు సిబ్బందిని ప్రశంసించారు.